పరువు సెడి కరువున పడింది

ఆమె వోర్తి పశుప్రియ, పక్షిప్రియ-
మనిషిని తన దరిమానానికి రానివ్వ
దని అనుకోవలసిందే—ఆమెకు నలుగాళ్ళంటే అంత అభిమానం. ఒక్క నలుగాళ్ళన్న మాటేం? మనిషిని తప్పించగా మిగిలే ఇతరం అంతా ఆమె బాబాకరానికి ఆకరం అనే మనం ప్రతి పాదించుకోవచ్చు. ఆమెను చూస్తుమా నిఖార్సైన స్త్రీ రత్నం; అప్రయత్నంగా ఆమె దేహయష్టిలోని రూప తాండవం పైకుండుండి యుబుకుతూంటే పరిసర ప్రపంచం జిగాల్మనక తప్పదు. మఱి పలికిందా అంటే కిన్నెర. పాడితే ఎవరో?

బాటనే నడచిపోతూవుంటే ఆమె హెచ్చు ఆర్థిక స్వాతంత్ర్యం గల యువతిలా కనిపిస్తుంది. మంచి అభిరుచి కలదానిలా తోచేస్తుంది. మొల్లో తాళాపు గుత్తి దోపుకొని ఓచేత్తో డబ్బుల గోతాం ఊపుకొంటూ ఉబుసాడే కాడ చటక్కన ఆ ఊపే ఊపే గోతాం రెండో అరచేతిలో ఘల్లుమనేటట్టు మోపుకొంటూ రంయి రంయి గుడిసెకు చేరుకుంటూంటే ఆమె వొయ్యారం చెప్ప శక్యంగాదు. చీర ఏలా మొలతిరిగి, మెడసురిగి, సిగనొరగి ముమ్మొలికలుపడీ, ముయ్యేరు మేలిముసుగ్గా సంజపొద్దుకు తయారు అవుతుందో ఎవ్వరికీ ఆ వొడుపు అలవడింది లేదు ఆ పేటలో—

కుడిప్రక్క తన చెవిని జుంకా మూతతో దోబూచు లాడిస్తూ, ఎడంప్రక్క ఎదర చెవికి వదిలేసినట్టు పైటజార్చి గుండె యులివు మాత్రంగా కాలమూర్తిని కదలించే నెఱజాణ.

కార్తీక నక్తాలకు శివుడి గుడికి వెళ్ళేటప్పుడైనా పెంపుడు కుక్కపిల్ల ఆమెకూడా వుండాలి. కూడు తినేటప్పుడు పిల్లి తనతో పాటు కంచుగిన్నె అంచు నాకుతూ వుండాలి. పెండాన్ని పంజరంలో చిలక, ఎడపిల్లలా తొక్కుపలుకులాడు తూండాలి, ఇలారం మీద గినికోళ్లు రెండు పురిట్లో కవలల్లే అరుస్తూవుండాలి. వసారారాట నోమర్కట కిశోరం.........! ఇలాగ్గా ఆమె ఆస్త పెద్ద జంతుప్రదర్శన భవనంలా కనిపిస్తుంది.

ఇంతెందుకు ? ఆమెయింట ఆ నరపాణంను చుట్టి మఱి నరపాణం లేదు. ఉన్నదంతా జంతుకోటి ! ఆ జంతుకోటిన్నీ అసంఖ్యాకం ! అంత పెద్ద ఝుంజాటం వుండిన్నీ యింకా చాల్దన్నట్లైందుకో యాతన పడుతుంది ఆపె. కాపడ్డ వాళ్ళతో "పెద్ద పుల్ని పెంచితే ఏలావుండెనో, ఎలుగ్గొడ్డును చేరదీస్తే ఏం చేస్తుందో ? సివంగు లంటారు వాటితో మనం స్నేహంగావుంటే అవి మనల్ని ద్రోహం చేయవు గదా !" అని అడివి జంతువుల మీదిక్కూడా, తన మనస్సు పోనిచ్చుకుంటూ-ఉన్నది పట్న వాసం అయినా అడవిని గురించి యోజిస్తూవుంటుంది ప్రతి నిత్యమూనూ.

ఇరుగు పొరుగు వాళ్ళందఱూ మనుష్యలు. మనుష్యలే కాకుండా వాళ్ళకు మనుష్యలంటే ఎక్కడలేని మక్కువ ఎక్కడలేని తగులాటమూను. వాళ్ళకు జంతువంటే కిట్టదు. అంచేత వాళ్ళంతా, పైని పేర్కొబడ్డ మనుష్యాంగనామణిని యిష్టంగానే చూచేవారు. కాని ఆమెపెంచే జంతువుల్ని రాయి పుచ్చుకునో కఱ్ఱపుచ్చుకునో కొడుతూ వచ్చేవారు. కొందఱు కొట్టడందాకా అసహ్యించుకోకపోయినా తిడుతూనైనా వుండేవారు. మొత్తం

మీద ఇరుగు పొరుగు వాళ్ళందఱికీ, ఆమె మనుష్యులయందుకాక జంతువులయందు విశేషప్రేమ చూపిస్తుందని........చెప్పొద్దూ-విశేష మాత్సర్యం వహించారు. అడివి జంతువుల మాట ఆమె ఎత్తినప్పుడల్లా " పోయి, అడివిలోనే వుండరాదా ? మా మధ్యను వుండి అడివో అడివో అని ఏడువక పోతేనని కజ్జాకు కాలు దువ్వేవారు కూడాను వాక్యాక్కప్పుడు. ఆమె ఆపాళంగా జుత్తు విరబోసికొని ఎదిరి వాళ్ళతో ప్రతికక్ష వహించక తప్పేది కాదు. ఆ సమయాన్ని ఆమె కుక్కలు వాళ్ళమీదకు బొంయి బొంయిమని పడి పిక్కలెక్కలాగబోయేవి. ఆమె కోతి వాళ్ళను చూడగానే కొఱకొఱ లాడేది. ఆమె చెప్పన్న జంతువులు శివ మెత్తి నట్టూగిపోయేవి. వెంటనే ముల్లోకాల నోళ్ళూ కట్టడి ఆమెకి లొంగి పోవలసిందే. మఱి అటువంటప్పుడు ఆమె స్వాధీనంలో కనుక శరభశార్దూలాలు, కరిమకరాలు, తేళ్ళూ నాగుబాములూ ఉన్నట్టయితే మనంఅంతా ఏమైపోయి ఉందుమో కదా యీ పాటికి—ఆలోచించుకోండి పాఠకులు !

ఒకానొక రోజున చక్కటి సాయంతనం సాంధ్యరాగం భోగయోగ్యంగా పొడము కొచ్చింది పైకి పడమటి దెస. కత పడుచు తనయింటి పంచ నొంటిగా కూర్చుని ఆకాశాన్ని అలముకు పొయ్యే చిత్రాతి చిత్ర సంకీర్ణపాటల వర్ణాన్ని తిలకిస్తూ వుండి, పెద్దపులి చారల్ని చూస్తూవున్న మాదిరిగా. ఆ పొద్దు పెద్దపులి నోరు కూడా ఆకాశాన్ని తెరవబడి వున్నా దన్నా స్వభావపు టుత్తే. ఏమా అంటే ఒక నల్లనిమేఘం దట్టంగా పైకిలేచి దవడలు విప్పి కోరలేర్పడి నాలుకచాచినట్లు పాయవడి గీతలడి మఱి చెదరి పోకుండా నిల్చి వూరుకుంది.

"పెద్దపులి పెద్దపులి ఆకాశాన్ని పెద్దపులి!" అని వెఱ్ఱిగా కేకేసింది అమ్మత్తకాసిని.

ఆ కేకకు ఎవళ్లూ ఇతరులు ఆమెను చేరుకోలేదుగాని, వీరనాగన్న అనే ఒకానొక వేసాలరాయడు, మనుష్యజాతిలో పురుషుడు "ఏమిటి నీకేం మతిపోతూవుందా ఏమిటి? కొఱ్ఱమ్మా?" అన్నాడు. అతగాడు పేరెట్టి పిలచేదాకా ఆమె పేరు లోకానికి ఆకలింపే లేదు. కొఱ్ఱమ్మ వెంటనే ఊరుకోక వేలెట్టి ఆకాశంకేసి చూపిస్తూ "సూడు! సూడు! ఏలా వుందో ఆకాశాన్ని దాన్నేమి టంటావు?" అని అడిగింది. అప్పటి కప్పుడే రంగుమాటి ఆకాశం కారునలుపు ముసుగులో పడింది. "అదే దేవుని విలాసం.

సంధ్యా వీధుల శార్దూలాలు
వెన్నెల బయళ్ళ వెల్లాంబోతులు
ఇరుల తొఱ్ఱట్లను ఎలుగుం గొడ్లు!"

అన్నాడు జవాబుగా. అనగానే కొఱ్ఱమ్మ కొప్పుసవరించుకొంటూ అడవిలోనే కాకుండా పులి మెకాలు ఆకాశాన్ని కూడా వాల్లాడి పోతూ వుంటాయా?" అని అడిగింది, వీరనాగన్న "ఓసివెఱ్ఱి కొఱ్ఱమ్మా! ఓసి వెఱ్ఱికొఱ్ఱమ్మ!" అని అనుకొంటూ కొఱ్ఱమ్మకు మరి బదులాడకుండా తన మానాన్ని ఏదో యోజన గావించు కుంటూ వెళ్ళిపోయినాడు.

ఆలా వెళ్ళిపోయినాగాని వీరనాగన్న పాడినపాట కొఱ్ఱమ్మకు నల్లమందులా పట్టించింది. సారాలా కైపెక్కించింది.

సంధ్యా వీధుల శార్దూలాలు
వెన్నెల బయళ్ళ వెల్లాంబోతులు
ఇరుల తొఱ్ఱట్లను ఎలుగుం గొడ్లు

అంటూ పాడుకుంటూ ఆకాశంకేసి చూసేది.

అలా చూస్తూ వచ్చిన కొజ్జమ్మను నోసాయంకాలం మటికొన్నాళ్లకు వీరనాగన్న ఏం చేశాడూ అంటే—తానా పొద్దు మొహరం పెద్దపులి వేషం వేసుకొని, డప్పు లేకుండా తప్పెట లేకుండా, గొలుసు లేకుండా గొడవ లేకుండా, వెనకాతలే వెళ్ళి కొజ్జమ్మను అమాంతంగా పిరుదులపై నూర్ధ్వం కావులించుకున్నాడు. కొజ్జమ్మ వెంటనే సరిదిరిగి తోసిపుచ్చి, ఫెడీల్ని ఒక్క చపేట యిచ్చుకుంది వీరనాగన్నను. వీరనాగన్న "మనిషిని, మనిషిని, నేను మనిషిని, పెద్దపులిని కాను కొజ్జమ్మా! నీవు పెద్దపులి పెద్దపులి అని కలవరిస్తున్నావు కదా అని ఆవేషం వేసుకువచ్చాను" అన్నాడు. కొజ్జమ్మ "మనిషి అంటే?"—వీరనాగన్న అప్రయత్నంగా అన్నాడు, పెద్దపులివేషం వేసిన వానికి అంతకంటె మనిషి అంటే అర్థం మాత్రం ఎట్లాకాగలదు? "మనిషి అంటే అదీవో జంతువే!" అని.

ఎప్పుడైతే వీరనాగన్న నోటమ్మట "మనిషి అంటే అదీ వోజంతువే" నన్న నిర్వచనం వినబడ్డాదో అదో భ్రాంతిగా కొర్రమ్మ వానిముఖంకేసి చూచింది. వీరనాగన్న చెంపతుడుచుకొంటూ "జంతువుని కొట్టినట్టు కొట్టేసినావు! కొర్రమ్మా!" అన్నాడు. కొర్రమ్మ వాని వంక రెండోసారి తేరిపారి చూచింది. ఎందుకో నిర్విణ్ణురాలైంది. తన మొల్లోనుంచి వో రూపాయతీసి వానికిచ్చింది. వీరనాగన్న మిక్కిలి సంతోషిస్తూ వెళ్ళిపోయినాడు.

"మనిషి! పెద్దపులి వేషంవేస్తాడు? మనిషి ఆంబోతులా అంకె వేస్తాడు? మనిషి! ఎలుగ్గొడ్డులా పట్టుకు అక్కేస్తాడు? మనిషీ వాసన వేస్తాడు? మనిషీ మైకం గొల్పుతాడు!" అని లోలో తన ఊహా ప్రపంచంలో తన మనిషిని చిత్రించుకుంటూ

కొర్రమ్మ తనయొక్క యిరుకు కుటీరంలోకి తలకు చూరు తగలకుండా వొంగొంగి ప్రవేసించింది.

కొర్రమ్మ కుటీరంలో నాటిరాత్రి, ఓ రెండోజామున ఉపద్రవంగా చీకటి కమ్మివుంది, కొర్రమ్మ తన దీపం ఎంత హెచ్చించినా ఆ చీకటిన్ని, అందులోనూ వొకానొక మూల నక్కియున్న దాన్ని సంహరించ లేకుండా వుంది. గుడిసె వెలుపల గొప్పగా వెన్నెల కాస్తూవుంది. గుడిసెలో గుహ తమస్సు, చిమ్మచీకటి. ఆ మూలను మటీ అంత అనుకోని అంధకార మేమా అని అల్లాటపడ దొడగింది.

ఆ అల్లాటలో నిజంగా మటి ఆలోచన తోచక కొర్రమ్మ తన కొంపకి తెలతెల వారుజామునే నిప్పంటించుకొంది. ఆ నిప్పు మంట చూరుకెక్కి చూరు వెదుళ్ళను పెటిల్లు పెటిల్లు మని పేలించేదాకా చుట్టుపట్ల వాళ్ళెవళ్ళూ మేల్కోలేదు. మేలుకొన్న తరువాతను కూడా వాళ్లదేదో దిఙ్మండలం మీది నెల తక్కువ సూర్యోదయంగా చూచి విస్తుపోయినారే గాని ఆరిపెయ్యడానికి ప్రయత్నించిన వారు గారు. కొర్రమ్మ దృష్టి యావత్తూ తనకు లొంగని గుయ్యారం మీదనే వుంది. అలా ఆవంక చూస్తూనే వుంది. అలా ఆమె చూస్తూ వుండగానే అసలు తెల్లాఅడం జరిగింది. జగత్తు కంతకూ తెలివి వచ్చింది, చూచింది కొర్రమ్మ బూడిదలో వెలుక్కోసాగింది. ఏం కనిపించిందామెకు ? ఎలుగ్గొడ్డుచర్మం మండి పోయిందొకటిన్నీ ఆ చర్మం క్రింద నుసి అయిపోయిన వీరనాగన్న బొంది వొకటిన్నీ ఆ రెండూ కొర్రమ్మ ముందు నాడు వెలిసిన కొత్త వస్తువులుగా కనిపించాయి.

తన్నిమేషం కొ్రమ్మ ఆ వీరనాగన్నయొక్క అంత్య ప్రమేయం ఇలా తలపోయసాగింది, "నేను వీరనాగన్నను అని చెప్పి దివ్యజ్యోతిగా నాకు సాయపడి నా మనస్సు దోచుకు పోవడానికి రాక, పెద్ద ఎలుగ్గొడ్డు వేషం వేసుక్కూర్చోవడం ఎందుకు ? కటిక చీకట్లో నా గుడిసెలో దొంగచాటుగా తాను ప్రవేశించి ? ధనమాసించి కాకపోతేను ? నన్ను చంపడానికి తానుచావడానికి కాకపోతేను ? లోక మిప్పుడేమంటుంది నన్ను ? జంతువును చంపాను అంటుందా ? జంతువు క్రింది మనిషిని చంపానంటుందా ? మనిషిని చంపాను అంటుందా ? మనిషి మీది జంతువును చంపానంటుందా ? దేన్ని ప్రేమించాను అంటుంది ? మనిషినా ? మృగాన్నా ?

సంధ్యా వీధుల శార్దూలాలు !
వెన్నెల బయళ్ళ వెల్లాంబోతులు !
ఇరులతొరట్లనుయెలుగుం గొడ్లు !"

అని తలపోసికొంటూ.........పరువుసెడి కరువున బడింది.